క్లుప్తంగా

వాలీబాల్ క్రీడాకారుడికి ఎస్పీ ప్రోత్సాహం



వనపర్తి: ఖిల్లాఘనపూర్ మండలం మిల్కిమియాన్‌పల్లి గ్రామం దేవరబండతండాకు చెందిన జరుపుల అశోక్ ఫిబ్రవరిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. అశోక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పోటీలకు దూరంగా ఉన్నట్లు తెలుసుకున్న ఎస్పీ రావుల గిరిధర్ తనవంతుగా సాయంగా రూ.15వేలు అందించి పోటీలకు సిద్ధం కావాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ క్రీడా పోటీలో ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని దశదిశలా చాటాలన్నారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ కృష్ణ, రిజర్వ్ సీఐ అప్పలనాయుడు, కార్యాలయ పోలీసు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



ఆత్మకూర్: మండల ప్రత్యేకాధికారిగా పంచాయతీరాజ్ డీఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రత్యేకాధికారిగా ఉన్న బీరం సుబ్బారెడ్డి ఇటీవలే సస్పెన్షన్‌కు గురికావడంతో ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పార్వతమ్మ, సిబ్బంది ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఘన స్వాగతం పలకడంతో పాటు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, మండలంలోని అధికారులు సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

ఎంపీడీఓగా చెన్నమ్మ

అమరచింత: మండల ఎంపీడీఓగా చెన్నమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తకోట మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న చెన్నమ్మ బదిలీపై అమరచింత ఎంపీడీఓగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు కొత్తకోట ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నమ్మ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సహకరించాలని కోరారు.

‘మద్యం తాగి వాహనాలు నడపొద్దు’



కొత్తకోట రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే అనర్థాలు తప్పవని కొత్తకోట ఎస్ఐ ఆనంద్ అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన 25మందికి ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆనంద్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి ఇతరుల మరణాలకు కారణం కావొద్దన్నారు. తాగి వాహనం నడిపేవారు ఎంతో ప్రమాదక వస్తువు లాంటి వారని, పోలీసులు చేసే వాహన తనిఖీలు కేవలం ప్రజల ప్రాణాల రక్షణ కోసమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పేదలకు ఇంటి స్థలాలు అప్పగించాలని వినతి



కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపాలిటీలో 1997 సంవత్సరంలో ఎస్సీ మైనార్టీలకు, బీడీ కార్మికులు 153మంది లబ్ధిదారులకు ప్లాట్లు ఇచ్చారని, వాటికి హద్దులు గుర్తించి లబ్ధిదారులకు అప్పగించాలంటూ దళిత సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కల నెరవేర్చుకోకుండా దీనస్థితిలో ఉన్న పేదలకు ఇదివరకు ఇచ్చిన ప్లాట్లను వారికి అప్పగిస్తే ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే అవకాశం ఉందని వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు మీషేక్, భాస్కర్, కొమ్ము క్రాంతి, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు జనంపల్లి కిరణ్, జేకే ప్రసాద్, సాయిల్, సుమంత్, రాజు, వినోద్ చిన్న తదితరులు ఉన్నారు.

రైతువేదికల నిర్వహణ గాలికి!

- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- ఏఈఓలపైనే భారం
- రైతులకు అందని సేవలు



సవాయిగుడెం రైతువేదిక

వనపర్తి రూరల్: వ్యవసాయంలో రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందిస్తూ.. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతువేదికల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగం మండలంలో చిట్యాల, చందాపురం, చిమనగుంటపల్లి, సవాయిగుడెం, పెద్దగూడెం, నాగవరం, కాశీంనగర్ గ్రామాలను క్లస్టర్లుగా ఏర్పాటు చేసి రైతువేదికలు నిర్మించారు. రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి మంగళవారం రైతులకు హైదరాబాద్ కేంద్రం నుంచి శాస్త్రవేతలు సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు అందిస్తున్నారు.

5వేల ఎకరాలకు..

మండలంలో 5 వేల ఎకరాలకు ఒక్కో వ్యవసాయ క్లస్టర్ చొప్పున ఒక రైతువేదిక నిర్మించారు. అప్పట్లో ఒక్కో రైతువేదిక నిర్వహణకు నెలకు రూ.9 వేల చొప్పున విడుదల చేశారు. కానీ 32 నెలల నుంచి రైతువేదికలకు నిధులు మంజూరు కాకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. ప్రతి నెలా నిర్వహణ ఖర్చులు అన్నీ సంబంధిత ఏఈఓలే భరించాల్సి వస్తోంది. దీంతో వివిధ ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణంగా రైతులకు సలహాలు, సూచనలు సకాలంలో అందడంలేదు.

సిబ్బంది కరువు

రైతువేదికలలో అవసరమైన సిబ్బందిని నియమించలేదు. కనీసం అటెండర్లు కూడా లేకపోవడంతో ఏఓలు, ఏఈఓలే నిర్వహణ చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తెలిపిన విధంగా ఒక్కో రైతువేదికకు ఖర్చు.. విద్యుత్ బిల్లుకు రూ.వెయ్యి, తాగునీరు, నీటివసతికి రూ.500, పరిసరాల శుభ్రత, నైట్ వాచ్‌మెన్‌కు రూ.3వేలు, స్టేషనరీ, ఇతర ఖర్చులకు రూ.వెయ్యి, నెలలో శిక్షణ కార్యక్రమాలకు రూ.2,500, నిర్వహణ వ్యయం, మరమ్మతు కోసం రూ.వెయ్యి ని వ్యవసాయాధికారులే భరించాల్సి వస్తోంది. నిర్వహణ లేకపోవడంతో రైతువేదిక చుట్టూ పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి మందుబాబులకు అడ్డాలుగా మారాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్వహణ నిధులు విడుదల చేసి రైతువేదికల్లో కనీస వసతులు కల్పించడంతో పాటు సిబ్బందిని నియమించాలని రైతులు కోరుతున్నారు.

వసతులు లేవు



రైతువేదికల నిర్వహణకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలి. కొన్నేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో రైతువేదికలు సమస్యలకు నిలయంగా మారాయి. దీంతో సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. ఏదైనా సమాచారం తెలుసుకునేందుకు రైతులు వెళ్తే కనీస వసతులు లేని పిరిస్థితి నెలకొంది.

– బాల్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

జీతం నుంచి చెల్లిస్తున్నాం



రైతువేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదు. దీంతో రైతు అవగాహన సదస్సులు నిర్వహించే సమయంలో ఆర్థిక భారం మాపై పడుతోంది. దీంతో పాటు విద్యుత్, తాగునీటి బిల్లులు, స్వీపర్ ఖర్చులకు సొంతగా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇటీవల కాలంలో రైతువేదిక నిర్వహణపై వివరాలు సేకరించింది. నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– యుగేంధర్, ఏఈఓ, సవాయిగుడెం క్లస్టర్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తి టౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తమ న్యాయమైన ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధన కోసం ధర్నా చౌక్ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం ఏడో రోజుకు చేరుకుంది. దీక్షలకు బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చొరవతో సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చినా.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. వారి న్యాయమైన డిమాండ్లు పూర్తయ్యే వరకు బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి బాసటగా ఉంటామన్నారు. దీక్షకు మద్దతు తెలిపిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దంతోజు నవీన్‌చారి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రవికుమార్, సీనియర్ నాయకుడు ఉందేకోటి అంజి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆగపోగు చాణిక్య, యువమోర్చా అధ్యక్షుడు ఎద్దుల రాజు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలో ఎస్సీ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించిన అనంతరమే గ్రూప్ పరీక్షల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీచౌక్‌లో మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష 6 రోజు కొనసాగాయి. కార్యక్రమంలో అజ్జపాగ లక్ష్మణ్, సోంబాబు, జానకీరాం, జహంగీర్, రామకృష్ణ, మాసన్న, డాక్టర్ కృష్ణకుమార్, గాలిపంపు శ్రీను, కిషోర్, రాము, అనిల్, వెంకటన్న, కురుమూర్తి ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పాన్‌గల్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అర్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు బాలికలతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినప్పటికీ, ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కిరణ్‌కుమార్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. అధికారులు కేవలం షోకాజ్ నోటీసు అందజేయడం సరికాదన్నారు. ప్రధాన ఆరోపణలు ఉన్న కిరణ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన నిలబడాల్సిన కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులే తప్పులు చేసినట్లు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వినయ్, రాకేష్, గణేష్, వంశీ, శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

‘పదో తరగతి’ విద్యార్థి దశకు పునాది

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులకు పునాది లాంటిదని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ప్యాడ్లు, పెన్నులు అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని రామనంతపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేష్ సోమవారం పాలెం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 50మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, పెద్ది రవి, శ్రీశైలం, అంజి, నవీన్, శ్రీను, నవాజ్, శేఖర్, వివేక్, ఎండీ కైఫ్, రాఘవేంద్ర, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం ఉన్నత పాఠశాలలో ఇటీవలే పదవీ విరమణ పొందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సోమవారం పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష కిట్‌ను వితరణగా అందజేశారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై ఉపాధి కూలీలకు అవగాహన

పాన్‌గల్: వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఉపాధి కూలీలకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు శశాంక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలు పనులకు ఉదయం వేళల్లో తొందరగా వెళ్లి ఎండ తీవ్రత పెరగకముందే ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తాగడంతో పాటు అలసటగా ఉంటే నీడలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని చల్లటి నీటిలో ముంచిన గుడ్డతో శరీరమంతా తుడుస్తూ వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, ఓఆర్ఎస్ ద్రావణం వాడకం వంటి అంశాలపై కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లానాయక్, వైద్య సిబ్బంది, ఆశాలు, కూలీలు పాల్గొన్నారు.

వసతి గృహం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వనపర్తిలో రిటైర్డ్ వార్డెన్ నిరంజన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వనపర్తి టౌన్: పట్టణంలోని వనపర్తి కేడీఆర్ ఏబీ హాస్టల్‌లో 1980 నుంచి 2020 వరకు చదువుకున్న విద్యార్థులు ఆదివారం రాత్రి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాస్టల్ పూర్వ విద్యార్థి అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వార్డెన్‌లను సన్మానించగా.. హాస్టల్‌లో చదువుకున్న తోటి విద్యార్థి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగాడని పూర్వపు విద్యార్థులు గువ్వల బాలరాజును సన్మానించారు.

మదనాపురం: మండలంలోని దంతనూర్ ప్రాథమిక పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. కీర్తి శేషులైన ఉపాధ్యాయులు కొండయ్య, రామచంద్రయ్య కు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు గట్టయ్య, శ్రీనివాస్‌చారి, లక్ష్మయ్య, తిమోతి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

అమరచింత: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ నందిమళ్ల పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. పీజేపీ క్యాంప్ నుంచి నందిమళ్ల మీదుగా చంద్రగఢ్ స్టేజీ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. పక్కనే కృష్ణానదిపై జూరాల ప్రాజెక్టు ఉన్నా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. గ్రామానికి మంజూరైన మూడు బోర్లను అధికార పార్టీ నాయకులు వెనక్కి పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో గ్రామ సమస్యల పరిష్కారంపై ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ఎమ్మెల్యే మౌనం వహించడం తగదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి వెంకటపతిరాజుకు అందించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ , సీపీఎం నాయకులు కుర్మన్న, ఆంజనేయులు, నారాయణ, ముకుందా, మైబు, ముని పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధం: రూ.లక్షల్లో నష్టం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ముగ్గురు రైతులకు చెందిన మామిడి చెట్లు సోమవారం అగ్నికి ఆహుతి కావడంతో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. మండల కేంద్రానికి చెందిన తెలుగు సంఘనమోని పెద్ద శేషయ్య, వెంకటయ్య, చిన్నశేషయ్యలకు చెందిన తోటలకు సోమవారం మధ్యాహ్న గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్లే మంటలు ఎగిసిపడి దాదాపు మామిడి తోటలోని 50 చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని రైతులు వాపోతున్నారు. తోటకు నిప్పంటించిన వారిని గుర్తించి తమకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం ఇదే గ్రామంలో ఎత్తం నాగేష్‌కు చెందిన తోటకు కూడా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో తీవ్రంగా నష్టపోయిన ఘటన చోటు చేసుకుంది. పోలీసు అధికారులు నిఘా ఉంచి నిందితులను గుర్తించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: క్షయ వ్యాధి రహిత మండలంగా మార్చేందుకు వైద్య సిబ్బంది గ్రామాల్లోనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంటలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ నిర్మూలన కోసం కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశానుసారం గ్రామానికే అంబులెన్స్‌లో మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేసే యంత్రాలు వచ్చి అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నిర్ధారణ పరీక్షలు చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన, ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కింద పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.వెయ్యి అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రామయ్య, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు మైథిలి, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని సింగిల్‌విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, మామిడిమాడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెన్నప్ప అన్నారు. సోమవారం మండలంలోని మామిడిమాడ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన చాంద్‌పాష అమ్మగారి జ్ఞాపకార్థం రూ.50 వేలతో ఆధునీకరించిన పాఠశాల హెచ్‌ఎం గదిని వారు ప్రారంభించారు. జీఎస్‌టీయూ హైదరాబాద్ పరీక్షల విభాగం అధికారి అరుణ కుమారి, గ్రామానికి చెందిన షమీంపాష పాఠశాల విద్యార్థులకు 1,500 నోట్ పుస్తకాలను అందించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులు 10వ తగరతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు మోహన్‌జీ, చాంద్‌పాష, జితేందర్‌రెడ్డి, బాల్‌లింగం, శ్రీనివాస్‌గౌడ్, సాయిలీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయపడిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదుకోవాలి



ఫీల్డ్ అసిస్టెంట్‌ను పరామర్శిస్తున్న బాల్యానాయక్

వీపనగండ్ల: విధి నిర్వహణలో భాగంగా ఉపాధి పని ప్రదేశానికి వెళ్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్యానాయక్‌పై అడవిపంది దాడి చేసి గాయపర్చిందని, అతడికి ప్రభుత్వం తరఫున మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ విజ్ఞప్తి చేశారు. వల్లభాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రెడ్యానాయక్ పని ప్రదేశానికి వెళ్తున్న క్రమంలో అడవి పంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితుడు మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నాడని, ఉన్నతాధికారులు స్పందించి వారి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని కోరారు.

ఆర్థికసాయం

పాన్‌గల్: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన సంఘనమోని కృష్ణయ్య కుటుంబాన్ని సోమవారం మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

పాన్‌గల్: దాడి ఘటనలో నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జమ్మాపూర్ గ్రామానికి చెందిన అన్నె భారతి కుటుంబానికి, ఆమె భర్త అన్నె బాలపీరుకు, సోదరుడు అన్నె కృష్ణయ్య కుటుంబానికి ఇంటి గోడ విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. అదే క్రమంలో సోమవారం అన్నె భారతి ప్రహరీకి నీళ్లు పడుతుండగా పాత గొడవలను మనస్సులో పెట్టుకొని అన్నె కృష్ణయ్య, అన్నె రాముడు, అన్నె నాగమ్మ, ఎల్లమ్మ నలుగురు వచ్చి అకారణంగా బూతులు తిడుతూ చంపుతామని బెదిరించడంతో పాటు చేతులు, కాళ్లతో తన్నడంతో పాటు కట్టెతో దాడి చేయగా తలకు రక్త గాయాలయ్యాయని భారతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసి గాయపర్చిన నలుగురిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అన్నె భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అత్తా, మామ పై దాడి చేసిన వ్యక్తిపై..

ఖిల్లాఘనపురం: భార్యతో పాటుగా అత్త, మామ పై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెనికితండాకు చెందిన కేతావత్ శ్రీను ఆదివారం రాత్రి భార్య కేతావత్ లావణ్యతో గొడవ పడి అనుచిత పదజాలంతో దూషించడంతో పాటుగా దాడి చేశాడన్నారు. అడ్డుగా వచ్చిన అత్త లక్ష్మి, మామ లాలుపై కట్టెతో దాడి చేయడంతో వారికి చేయి, వేళ్లకు రక్తగాయాలయ్యాయి. ఈ విషయమై సోమవారం కేతావత్ లావణ్య ఫిర్యాదు మేరకు భర్త కేతావత్ శ్రీనుపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

సాగునీరు అందించాలి

కొత్తకోట రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ దేవరకద్ర నియోజకవర్గం అసెంబ్లీ ఇన్‌చార్జీ జనుంపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తకోట మండలంలో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలంటూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. సాంప్రదాయ వృత్తులకు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద ఉచిత శిక్షణ, సర్టిఫికెట్, టూల్ కిట్, బ్యాంకు రుణ సదుపాయాలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్తకోట, మదనాపురం రైతులకు ఏనుకుంట రిజర్వాయర్ ఆయకట్టు కింద సాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. గురుకుల విద్యాసంస్థలకు తగిన సౌకర్యాలు, బోధన సిబ్బంది, హాస్టల్ వసతులు, భోజన నాణ్యత మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆశాలకు కనీస వేతనం అమలు చేయాలి



వనపర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశాలు

సాక్షి, నెట్‌వర్క్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశా కార్యకర్తలు, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలకు నెలకు రూ.18వేల కనీస వేతనం అమలు, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశాలకు ఏఎన్ఎం పోస్టుతో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

- వనపర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధంతో ఆశాలు ధర్నా చేశారు. అనంతరం ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ, సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆశాలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అందజేశారు. కార్యక్రమంలో నందిమళ్ల రాములు, ఆశాలు బాలకృష్ణమ్మ, చిట్టెమ్మ, భాగ్య, సునీత, కవిత పాల్గొన్నారు.
- కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన ఆశా కార్యకర్తలు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి భాగ్య, మంజుల, పుష్ప, సంతోష, గీత, వెంకటేశ్వరమ్మ, శ్వేత, చంద్రకళ, అర్చన, కాంచన తదితరులు పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలో ఆశాలు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ అబ్రహాంలింకన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, అనసూయ, జ్యోతి, నీలిమ, సుజాత, గౌరి, మౌలాన్‌బీ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.
- గోపాల్‌పేటలో ఆశావర్కర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లత, శ్యామల, రాజకుమారి, మాధవీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.
- వీపనగండ్ల ఆశాకార్యకర్తలు తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వైద్యాధికారి రాజశేఖర్‌కు మరో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మి, సుజాత, రాధ, రాణి తదితరులు పాల్గొన్నారు.
- ఆత్మకూర్‌లో ఆశాలు తహసీల్దార్ చాంద్‌పాషకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఆర్ఎన్ శంకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- అమరచింతలో ఆశావర్కర్లు తహసీల్దార్ రవి యాదవ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు బుచ్చన్న, రాఘవ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.
- ఖిల్లాఘనపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశాలు ధర్నా నిర్వహించారు.



గోపాల్‌పేటలో..



మదనాపురంలో..